క్లుప్తంగా

అద్దె బకాయిల వసూళ్లలో అధికారులు



బకాయిల వసూళ్లలో కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న దుకాణ అద్దె బకాయిలు చెల్లించకుంటే ఉపేక్షించబోమని అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్, జనతా బజార్ ప్రాంతాల్లో బకాయి ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి అద్దెలను వసూలు చేశారు. పలువురు దుకాణదారులు సమయం కావాలని కోరటంతో గడువు విధించిన అధికారులు నిర్ణీత సమయంలో బకాయిలు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీర్ఘకాలికంగా దుకాణ అద్దె బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ శాఖ ఎస్ఈకి సన్మానం



ఎస్ఈని సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ శాఖ ఎస్ఈ ముువ్వల లక్ష్మణరావును దాసన్నపేటలోని విద్యుత్ భవన్‌లో బుధవారం విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) సభ్యులు ఘనంగా సన్మించారు. వరుసగా నాలుగేళ్లు సీఎండీ, కలెక్టర్ల చేతులు మీదుగా అవార్డులు అందుకుంటున్న సందర్భంగా సన్మానించినట్టు సంఘం కార్యదర్శి సురగాల లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, దేముడు, రామునాయుడు, కూర్మారావు, గంగునాయుడు, అప్పలనాయుడు, సీతారామరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ సూరిబాబుకు షూటింగ్ పతకం



సూరిబాబును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ఇటీవల జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ పోటీలో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ జి.సూరిబాబు ప్రతిభ చూపి పతకం సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీవీ సాయిదేవమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, అధ్యాపకులు అభినందించారు.

వసతిగృహం తనిఖీ



నిరాశ్రయుల వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి

విజయనగరం లీగల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాల మేరకు పట్టణంలో నిరాశ్రయుల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వసతిగృహంలో ఉన్న బాధితులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు, పురుషులు ఎవరైతే నిరాదరణకు గురై షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం పొందుతారో వారికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తుందన్నారు. ఏ విధమైన న్యాయపరమైన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని తక్షణమే పరిశీలిస్తామన్నారు. అనంతరం పడక గదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

రోడ్లపై భవన వ్యర్థాలు వేస్తే చర్యలు

విజయనగరం: నగరంలోని విచ్చలవిడిగా రోడ్లపై భవన వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు చెప్పారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని పూల్‌బాగ్ ప్రాంతంలో ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన భవన వ్యర్థాలు గుట్టలుగా ఉండటాన్ని గమనించిన ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని మందలించారు. తక్షణమే భవన యజమానితో వ్యర్థాలను తరలించే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం డస్ట్ బిన్‌లలో పేరుకుపోయిన చెత్తను త్వరితగతిన తరలించాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

దివ్యాంగులపై 'కూటమి' కుట్ర

- పింఛన్ల తగ్గించేందుకు అడ్డుగోలు నిబంధనలు
- 40 శాతం కంటే తక్కువ వైకల్యం వుందని నోటీసులు
- మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఆందోళన
- జీవనాధారం ఎలా అంటూ దివ్యాంగుల ఆందోళన



పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల వెతలు



ఎంపీడీవో రాధికకు దివ్యాంగులతో కలిసి వినతి పత్రం అందచేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

పూసపాటిరేగ : మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల పింఛన్‌లపై కూటమి సర్కారు కత్తెర వేసింది. పింఛన్‌లు తగ్గించాలనే నెపంతో పింఛన్ రీ వెరిఫికేషన్ పేరిట సదరం కార్యక్రమం చేయించారు. సదరంలో 40 శాతం కంటే తక్కువ వైకల్యం వున్నట్టు సచివాలయాలకు నోటీసులు జారీ చేశారు. సచివాలయాల నుంచి పింఛన్‌దారులకు నోటీసులు ఇచ్చి సెప్టెంబరు నెల నుంచి పింఛన్ ఆపివేస్తున్నట్టు సమాచారం ఇచ్చారు. తాజాగా నోటీసు అందుకున్న లబ్ధిదారులు మరలా సదరం ప్రోగ్రాంకు హాజరు కావడానికి గ్రీవెన్సు పెట్టుకోవాలని తెలియజేశారు. అయితే వాస్తవానికి కేవలం పింఛన్‌లు తగ్గించాలనే కుట్రతోనే సర్కారు రీ వెరిఫికేషన్ పేరిట అన్యాయం చేస్తున్నారని వాపోయారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు వైద్యులు సరైన నిర్ధారణ పరీక్షలు చేయకుండానే నోటీసులు జారీ చేయడంతో లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. నెల్లిమర్ల మండలం కోరాడపేటకు చెందిన చందక పైడమ్మ మానసిక దివ్యాంగురాలకు అన్ని అర్హతులున్నా పింఛన్ నిలిపి వేస్తున్నట్టు నోటీసు ఇచ్చారు. ఎంతో మంది నిరుపేదలైన అభాగ్యులకు పింఛన్ నిలిపివేస్తున్నట్టు నోటీసులు జారీ చేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అని లబ్ధిదారులు వాపోతున్నారు. చాలా మంది దివ్యాంగులు నెలనాడు పడే పింఛన్ కోసమే ఆధారపడిన కుటుంబాలు. కూలి పని చేసుకొని జీవించే కుటుంబాలు కొన్ని అయితే, నెలనాడు పింఛన్‌పై ఆధారపడిన కుటుంబాలు మరి కొన్ని వున్నాయి. గతంలో ప్రభుత్వమే మంజూరు చేసిన సర్టిఫికెట్ స్థానంలో రీ వెరిఫికేషన్ చేసి జీవితాలు మార్చారని ఆందోళన చెందుతున్నారు. పేదరికంతో వున్న ఎన్నో కుటుంబాల పింఛన్ తొలగించడంతో రోడ్డున పడ్డారు అని వాపోతున్నారు. పూసపాటిరేగ మండల పరిధిలో 227 పింఛన్‌లు తొలిగిస్తూ నోటీసులు జారీ చేయడంతో గత రెండు రోజులుగా మండల పరిషత్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. సెప్టెంబరు నెల నుంచి నోటీసులు ఇచ్చిన వారందరికి పింఛన్ రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్‌పై ఆధారపడిన ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి అని ఆందోళన చెందుతున్నారు.

వైద్య పరీక్షలకు మళ్లీ పంపిస్తాం..

దివ్యాంగుల కోటాలో రీ వెరిఫికేషన్ తరువాత నోటీసులు జారీ చేసిన దివ్యాంగులు మళ్లీ అప్పీలు చేసుకోవడానికి అవకాశం వచ్చింది. గ్రీవెన్సు పెట్టుకుంటే మళ్లీ సదరం కార్యక్రమానికి పంపిస్తాం. ఓకే అయితే పింఛన్ వస్తుంది. పూసపాటిరేగ మండలంలో 227 మందికి నోటీసులు ఇచ్చాం.

– ఎం.రాధిక, ఎంపీడీవో, పూసపాటిరేగ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాత్కాలిక భవనం పరిశీలన



పశు సంవర్ధక శాఖ కేంద్ర కార్యాలయ భవన సముదాయ గదుల్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాత్కాలికంగా అద్దె భవనంలో ఉండే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక పశు సంవర్ధక శాఖ కేంద్ర కార్యాలయ భవన సముదాయాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. మూడు అంతస్తుల్లోని ప్రతీ గదిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైనన్ని గదులు, వసతులు అక్కడ అందుబాటులో లేవని నిర్ధారించారు. డిగ్రీ కళాశాల భవనం కోసం ఇప్పటికే వేణుగోపాలపురం వద్ద ఐదెకరాలను కేటాయించడం జరిగిందని, భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. ఇక్కడ తాత్కాలిక గదుల నిర్మాణానికి రూ.పది లక్షల మంజూరు చేస్తామని చెప్పారు. దీనిపై ఉన్నత విద్యా శాఖ డైరెక్టర్ నారాయణ భరత్‌కుమార్ గుప్తతో మాట్లాడారు. ప్రస్తుతానికి ప్రైవేటు అద్దె భవనానికి కళాశాలను తరలించాలని అద్దె మంజూరు చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యార్థులకు అన్ని వసతులతో తగినంత విశాలమైన ప్రైవేటు భవనాన్ని గుర్తించి ప్రస్తుతం కళాశాలలో నడుస్తున్న డిగ్రీ కాలేజీను అందులోకి తరలించాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించండి : డీఎల్‌పీవో



రామతీర్థంలో స్వమిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నెల్లిమర్ల రూరల్: కాలువలపై ఆక్రమణలను తక్షణమే తొలగించాలని పంచాయతీ సిబ్బందికి డీఎల్‌పీవో శిరీషా రాణి ఆదేశించారు. మండలంలోని రామతీర్థంలో బుధవారం ఆమె పర్యటించారు. కాలువలను ఆక్రమించి షాపులు, ఇళ్లు నిర్మించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలను ఆక్రమిస్తే మురుగు నీరు బయటకు ఎలా వెళుతుందని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి ఇంటింటా చెత్త సేకరణపై ఆరా తీశారు. క్రమం తప్పకుండా చెత్త సేకరించి కేంద్రాలకు తరలించాలన్నారు. నిర్ణీత గడువులోగా స్వమిత్వ సర్వే పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు జరగాలని, తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శంకర జగన్నాథం, కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి

విజయనగరం గంటస్తంభం: విజయనగరం జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారికి ఉపాధి కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కలెక్టర్ డాక్టర్. బిఆర్.అంబేద్కర్‌ని కోరారు. బుధవారం కలెక్టర్‌కి వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, కొత్త పరిశ్రమలు రాలేదని, వ్యవసాయం గిట్టుబాటు లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

సమస్యలపై సమరశీల పోరాటం



ఎన్నికైన సభ్యులతో ప్రతినిధులు

నెల్లిమర్ల: సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు, సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీవీ రమణ పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నెల్లిమర్ల నగర పంచాయతీ మహాసభ స్థానిక అల్లూరి సీతారామరాజు స్మారక కళా వేదికలో బాబురావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంతో కుదిరిన ఏ ఒక్క ఒప్పందానికి జీవో ఇవ్వలేదని, రిటైర్మెంట్ అయిన, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వటం లేదన్నారు. ఉద్యోగులు అని నమోదు కావడంతో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. పట్టణాల విస్తరణ, జనాభా పెరుగుతున్నప్పటికీ కార్మికుల సంఖ్య పెరగడం లేదని, ఉన్న కార్మికులపైనే అదనంగా పని భారం పడుతుందన్నారు. అనంతరం తొమ్మిది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా టి.బాబురావు, బి.హరిబాబు, కోశాధికారిగా ఎం.దుర్గారావు, మహిళా కన్వీనర్‌గా బి.లక్ష్మి, సభ్యులుగా బి.రాము, జె.గౌరీషు, బి.బాలరాజు, బి.శంకర్, బి.శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డ్రాయింగ్‌లో పూసపాటిరేగ విద్యార్థుల ప్రతిభ

పూసపాటిరేగ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయనగరం సంస్థాన భారతి స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో విజేతలుగా నిలిచారు. పాఠశాలకు చెందిన జి.గాయిత్రి, డి.హేమంత్ కుమార్ మొదటి బహుమతి, సిహెచ్ జగదీష్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవడంతో హెచ్ఎం సౌభాగ్యలక్ష్మి, డ్రాయిగ్ మాస్టార్ ఐ.చినసత్యనారాయణ, ఉపాధ్యాయిని పార్వతి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు శ్రీకారం చుట్టాలని స్కిల్స్ డీన్ అనిల్ కుమార్, అధ్యాపకురాలు మాధవి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఆవిష్కాంధ్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఆవిష్కరణలు చేసేందుకు నేడు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహకాలు అందజేస్తోందని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. స్టార్టప్‌కు, వ్యాపారానికి ఉన్న తేడాలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విజయనగరం అర్బన్: నెల్లూరులో ఈ నెల 21వ తేదీన జరిగే ఆంధ్ర రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు పట్టణానికి చెందిన ది నేషనల్ స్కూల్ విద్యార్థి బొడ్డు జోనాథాన్ నిహార్ ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల కరస్పాండెంట్ బొడ్డు రామారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్-15 (డబుల్స్) విభాగంలో ప్రథమ బహుమతి గెలుచున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.

రక్తదాన శిబిరం రేపు

విజయనగరం టౌన్: విశ్వబంధుత్వ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో ఈ నెల 22న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని బికె.అన్నపూర్ణ దీదీజీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రక్తదాన శిబిరాలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సరస్వతి, బ్రహ్మకుమారీలు బికె.జ్యోతి, బికె.వైష్ణవి, బికె.మంజూష తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఎస్పీ అభినందన

డెంకాడ: ఎస్పీ వకుల్ జిందల్ డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసినాయుడును అభినందించారు. విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డెకాయిట్ కేసును 24 గంటల్లో ఛేదించి నలుగురు ముద్దాయిలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి నాలుగు మోటారు సైకిళ్ల రికవరీ టీం వర్క్ చేసినందుకు ఎస్ఐ సన్యాసినాయుడును ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

విజయనగరం టౌన్: చిరంజీవి సేవా కార్యక్రమాలు కోట్లాది మంది అభిమానులకు స్ఫూర్తిదాయకమని జనసేన నాయకులు గురాన అయ్యలు పేర్కొన్నారు. జిల్లా చిరంజీవి యువత, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్, వాకర్స్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా బుధవారం మెగాభిమానులకు చిరు సత్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు, ప్రతినిధులు సతీష్, రవితేజ, లక్ష్మణ్, కళ్యాణ్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసకారి పాలనకు చరమగీతం పాడాలి



ధర్మపురిలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లు

- నగరంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం

విజయనగరం: ఎన్నికలకు ముందు అధికారం కోసం హామీలు గుప్పించి నేడు వాటిని అమలు చేయని కూటమి ప్రభుత్వం మోసకారి పాలనకు చరమగీతం పాడాలని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 30వ డివిజన్ పరిధిలోని ధర్మపురిలో మహిళా విభాగం నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి ఇతర మహిళా నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మోసాన్ని, అన్యాయాన్ని కరపత్రాల రూపంలో అందజేశారు. చంద్రబాబుకు అబద్ధపు హామీలతో గద్దెనెక్కటం అలవాటుగా మారిపోయిందని ప్రజలంతా చైతన్యవంతులు కావాలని సూచించారు. అధికారం కోసం చంద్రబాబు నోటికొచ్చిన హామీలు ప్రకటించి, నేడు వాటిని అమలు చేయమని ప్రశ్నించే వారిపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, కేవలం రెడ్ బుక్‌రాజ్యాంగం నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్నది మరల రాజన్న రాజ్యమేనని, త్వరలోనే సంక్షేమ పాలన సార్థకత చేసి చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 15లోపు పంట నమోదు చేసుకోవాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏవో

డెంకాడ: వచ్చే నెల సెప్టెంబర్ 15వ తేదీలోపు రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో టి.సంగీత అన్నారు. మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ-పంట నమోదు చేసుకోవడం వలన పంటలను ప్రభుత్వ మద్దతు ధరకు రైతులు విక్రయించుకోవచ్చని చెప్పారు. వరి నాట్లు వేసే ముందు నారు చివర్లు తుంచి నాటుకోవాలన్నారు. దీని వలన పురుగు ఉధృతిని నివారించవచ్చని వివరించారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు మేలుగా ఉంటుందన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకం మంచిది కాదన్నారు. ఎరువులు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. వరిలో కలుపు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈవో లిఖిత, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల కుదింపు నిర్ణయం సిగ్గుచేటు : సీపీఐ

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ ఆదాయం మిగులు కోసం దివ్యాంగ, వృద్ధాప్య, వితంతు మొదలైన అర్హులైన వారికి చెల్లిస్తున్న పింఛన్లు కుదించాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయం సిగ్గు చేటు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన సీపీఐ విజయనగరం సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం సామాజిక పెన్షన్ల కోత సరికాదన్నారు. అర్హులైన వారి పింఛన్లు రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్లు కొనసాగిస్తూ నేటికీ అర్హత కలిగిన కూడా పెన్షన్ వర్తించని వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తూ పోరాడుతుందని అశోక్ తెలిపారు.

ఈ చలానాల వేధింపులు ఆపాలి



డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: ఆటో డ్రైవర్లపై ఈ చలానాలను పూర్తిగా నిలుపుదల చేయాలని శ్రీ విజయ దుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు పేర్కొన్నారు. ఈ మేరకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15 వేలకు పైగా ఆటో కార్మికులు ఆటోలపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సులు ప్రవేశపెట్టడం వలన 90శాతం తమ జీవన ప్రమాణం పడిపోయిందన్నారు. మరోపక్క ఇన్సూరెన్స్‌లు, స్పేర్ పార్ట్‌లు, అధిక వడ్డీలకు ఫైనాన్స్‌లు, ఈ చలానాల ద్వారా వేలాది రూపాయలు ఫైన్‌లు, మరోపక్క ఎంవీ ఇన్‌స్పెక్టర్లు వేలాది రూపాయలు పెనాల్టీలు వేయడం వలన తమకు ఆత్మహత్యలు తప్ప మరో శరణ్యం లేదన్నారు. ఆటో డ్రైవర్ల పట్ల మానవీయ కోణంలో ఆలోచించి ఆర్‌టీవో, పోలీస్ వేధింపులు లేకుండా పూర్తిగా నిలుపుదల చేసే విధంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.ధర్మారావు, చెన్నా ధర్మారావు, రాము, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ సైంటిఫిక్ టెంపర్ దినోత్సవం



నరేంద్ర దాబోల్కర్ చిత్రపటానికి నివాలు అర్పిస్తున్న పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ

విజయనగరం అర్బన్: సైంటిఫిక్ టెంపర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గురజాడ పాఠశాలలో నరేంద్ర దాబోల్కర్ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ నరేంద్ర దాబోల్కర్ పోరాటంతో అమలులోకి వచ్చిన మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం అన్ని రాష్ట్రాల్లోనూ అమలైతే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.